

ఈవీఎంల పరిశీలన షురూ

ఒంగోలు భాగ్యనగర్లోని ఈవీఎం గోదాములో ఈవీఎం బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్ల పరిశీలనను సోమవారం ప్రారంభించారు.

- 10లో..



ఎస్పీ స్పందనకు 121 ఫిర్యాదులు

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 121 ఫిర్యాదులు వచ్చాయి. ఎస్పీ మలికాగర్గ్ ఫిర్యాదులు పరిశీలించారు. - 10లో..

గరిష్ఠం/కనిష్ఠం
35.9/27.4

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. పగలు ఉక్కపోత అధికం. రాత్రిపూట చల్లని గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

పీఆర్‌టీయూ జిల్లా అడ్‌హక్ కమిటీ అధ్యక్షునిగా చిరంజీవి

ఒంగోలు: పీఆర్‌టీయూ జిల్లా అడ్‌హక్ కమిటీ అధ్యక్షునిగా ధర్నాశి చిరంజీవిని నియమిస్తూ పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్ణయించింది. విజయవాడ స్వాతంత్ర్య సమరయోధుల భవన్‌లో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈ కమిటీని ప్రకటించారు. అధ్యక్షునిగా ధర్నాశి చిరంజీవి, ప్రధాన కార్యదర్శిగా రావినూతల సతీష్, సహాధ్యక్షులుగా యల్లమంద, కార్యదర్శిగా మాల్యాద్రి, ఆర్థిక కార్యదర్శిగా కె.వెంకటేష్‌లను నియమించారు.

బాల్య వివాహాలు అరికడదాం



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, మేయర్

ఒంగోలు అర్బన్: బాల్య వివాహాలను అందరం కలిసికట్టుగా అరికడదామని, ఆ దిశగా ప్రతి ఒక్కరూ చేయి చేయి కలపాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. సోమవారం ప్రకాశం భవనం వద్ద మెప్మా ఆధ్వర్యంలో బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను వివరిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. జెండా ఊపి ర్యాలీ ప్రారంభించిన కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గడిచిన ఏడాదిలో 135 బాల్య వివాహాలను నిలువరించామన్నారు. బాల్య వివాహాల నివారణ కోసం గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డ్వాక్రా మహిళల ద్వారా బాల్య వివాహాల నివారణపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చిన్న వయసులోనే పెళ్లి చేయడం వలన బాలికలకు ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, మెప్మా పీడీ రవికుమార్, ఐసీడీఎస్ పీడీ మాధురి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బిందువు...ఒడిసిపట్టి

బోర్లే ఆసరాగా వ్యవసాయం చేస్తున్న పశ్చిమ ప్రకాశం రైతులకు బిందుసేద్యం వరంగా మారింది. బిందువు.. బిందువును ఒడిసిపట్టి నీటి కొరతను అధిగమిస్తున్నారు. తక్కువ నీటి వినియోగంతో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసి ముందుకు సాగుతున్నారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహాన్ని అందిస్తోంది. భారీ సబ్సిడీతో పరికరాలు అందిస్తూ అండగా నిలుస్తోంది. జిల్లాలో 10,300 హెక్టార్లలో సాగు లక్ష్యం కాగా ఇప్పటికే 7211 ఎకరాల్లో 6,368 మంది రైతులు వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు.



రైతులకు వరంగా తుంపర సేద్యం

- జిల్లాలో 10,300 హెక్టార్లు డ్రిప్ లక్ష్యం
- ఇప్పటికే 7211 హెక్టార్లలో డ్రిప్ సౌకర్యం
- రూ.71.15 కోట్లు సబ్సిడీ
- 90 శాతం సబ్సిడీపై డ్రిప్ పరికరాల అందజేత

మార్కాపురం:జిల్లాలో నీటి సమస్య ఉన్న ప్రాంతాల్లో బిందు సేద్యం (డ్రిప్ ఇరిగేషన్) వరంగా మారుతోంది. రాష్ట్ర ప్రభుత్వం డ్రిప్ ఇరిగేషన్‌కు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ప్రధానంగా నీటి సమస్య ఉన్న పశ్చిమ ప్రకాశంలో రైతులను ఆదుకుంటోంది. సాధారణంగా బోర్ల కింద ఎకరాకు సరిపోయే నీరు బిందు సేద్యం ద్వారా 3 ఎకరాలకు సరిపోతుంది. ఈ విధానం ద్వారా ఆరుతడి పంటలతోపాటు మిర్చి, పత్తి, పండ్ల తోటలు కూడా రైతులు సాగుచేస్తున్నారు. డ్రిప్ ద్వారా మొక్కకు కావాల్సిన నీరు అందుతుండడంతో వేరు ఎండిపోకుండా ఎదుగుదలకు ఉపయోగపడుతుంది. ఎరువులు, పురుగుమందులు కూడా మొక్కకు కచ్చితంగా అందుతాయి. నీటి లభ్యత తక్కువగా ఉండటం, వర్షాధారంపైనే పశ్చిమ ప్రకాశంలో పంటల సాగు ఉన్న నేపథ్యంలో వందలాది మంది రైతులు ఈ విధానం ద్వారా పంటలను సాగు చేపట్టారు.

భారీ సబ్సిడీ:

ఐదెకరాల్లోపు ఉన్న రైతులకు 90 శాతం, 5 నుంచి 10 ఎకరాల్లోపు ఉన్న రైతులకు 70 శాతం సబ్సిడీతో రాష్ట్ర ప్రభుత్వం డ్రిప్ పరికరాలకు అందిస్తోంది. ఈ ఏడాది మార్చి నాటికి జిల్లా వ్యాప్తంగా 10,300 హెక్టార్లలో సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే 7300 హెక్టార్లలో డ్రిప్ పరికరాలను రైతుల పొలాల్లో బిగించి సాగు చేస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా ఇలా...

జిల్లాలో యర్రగొండపాలెం, దర్శి, మార్కాపురం, గిద్దలూరు, కొండపి, కనిగిరి, ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో డ్రిప్ సిస్టం అమలు చేస్తున్నారు. డ్రిప్ పరికరాలు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం పరిశీలించి మంజూరు చేస్తోంది. మార్కాపురం నియోజకవర్గంలో 1588 హెక్టార్లలో 1378 మంది రైతులకు డ్రిప్ పరికరాలు అందించారు. ఇక్కడ లక్ష్యం 1250 హెక్టార్లు కాగా, లక్ష్యానికి మించి రైతుల పొలాలకు డ్రిప్ సిస్టం ఏర్పాటు చేశారు. యర్రగొండపాలెంలో 1540 మంది రైతులకు 1790 హెక్టార్లలో, దర్శిలో 1213 మంది రైతులకు 1212 హెక్టార్లలో, గిద్దలూరులో 658 మంది రైతులకు 711 హెక్టార్లలో, కొండపిలో 708 మంది రైతులకు 839 హెక్టార్లలో, కనిగిరిలో 705 మంది రైతులకు 904 హెక్టార్లలో, ఒంగోలులో 60 మంది రైతులకు 55 హెక్టార్లలో, సంతనూతలపాడులో 106 మందికి గానూ 108 హెక్టార్లలో డ్రిప్ సిస్టం బిగించారు. జిల్లా మొత్తం మీద 6368 మంది రైతులకు 7211 హెక్టార్లలో ఇప్పటికే డ్రిప్ సౌకర్యం కల్పించారు. దీనితో పండ్ల తోటలు, ఆరుతడి పంటలు, మిర్చి, పత్తి పంటలు సాగవుతున్నాయి. ఇందుకోసం రూ.71.15 కోట్లను ప్రభుత్వం సబ్సిడీ రూపంలో అందించింది.

ఐదేళ్లు కంపెనీలో సేవలు:

రైతుకు డ్రిప్ బిగించిన కంపెనీ పనిముట్లు పాడైతే ఐదేళ్ల వరకూ ఉచిత సర్వీసు అందిస్తున్నాయి. పాడైపోయిన విడిభాగాన్ని రైతు కొనుగోలు చేసి తెచ్చుకోవాలి. ఇలా ప్రభుత్వం కంపెనీలతో రైతుల మధ్య అగ్రిమెంటు చేసింది. నాణ్యమైన డ్రిప్ పరికరాలను పొలాలకు బిగించడంతో నీటి వృథా అరికడుతున్నారు. అంతేకాకుండా పంట నాణ్యత, దిగుబడి పెరుగుతుంది. గిట్టుబాటు ధర కూడా వస్తుంది. నీటి లభ్యత వలన మొక్కలు బాగా పెరుగుతాయి. 30 నుంచి 50 శాతం వరకూ అధిక దిగుబడి వస్తుంది.



ఆర్‌బీకేల్లో దరఖాస్తు చేసుకోవాలి

మా సంస్థకు కలెక్టర్ చైర్మన్‌గా ఉన్నారు. డ్రిప్ సిస్టమ్ కావాల్సిన రైతులు తమ సమీపంలో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో అన్ని డాక్యుమెంట్లతో దరఖాస్తు చేసుకుంటే మా సిబ్బంది వచ్చి పరిశీలించి మంజూరు చేస్తారు. ఇప్పటికే జిల్లాలో 7211 హెక్టార్లలో డ్రిప్‌ను బిగించాం. వేరుశనగ, మిర్చి, పండ్ల తోటలకు కూడా డ్రిప్ సిస్టం ఏర్పాటు చేసుకోవచ్చు. వారంలో రెండు రోజుల పాటు పొలాలకు వెళ్లి రైతులకు డ్రిప్ ప్రయోజనాలను వివరిస్తున్నాం. డ్రిప్ వినియోగంతో నీటికొరతను అధిగమించడంతో పాటు మెరుగైన దిగుబడులు సాధించవచ్చు.

– పీవీ రమణ, ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు డైరెక్టర్, ఒంగోలు



పత్తి పొలానికి డ్రిప్ పెట్టుకున్నా

మా ఊరిలో మాకున్న మూడెకరాల పొలంలో పత్తి సాగు చేస్తున్నాను. నీటి వృథా అరికట్టేందుకు డ్రిప్ సిస్టం ఏర్పాటు చేసుకుందామనుకొని దరఖాస్తు చేసుకున్నా. అధికారులు వచ్చి పరిశీలించి డ్రిప్‌సిస్టం ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ అవసరమైన వరకూ పత్తిచేనుకు వెళ్లి నీళ్లు పెట్టుకుంటున్నా.

– ఆరికట్ల సుబ్బమ్మ, చెన్నారెడ్డిపల్లి



డ్రిప్ ద్వారా సాగవుతున్న పత్తి పంట

నకిలీ డాక్యుమెంట్ల కేసులో ముగ్గురు అరెస్ట్

- నకిలీ డాక్యుమెంట్లు, స్టాంపుల తయారీ కేసుల్లో దర్యాప్తు వేగం
- ఎస్పీ మలికాగర్గ్ నేతృత్వంలో లోతుగా పరిశీలన
- ఏఎస్పీ కే.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్న సిట్ బృందం
- కేసు వివరాలు వెల్లడించిన ఒంగోలు డీఎస్పీ నారాయణ స్వామిరెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి

ఒంగోలు సబర్బన్: నకిలీ డాక్యుమెంట్లు, స్టాంపుల తయారీ కేసులో ఒంగోలు తాలూకా పోలీసులు సోమవారం మరో ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఈ మేరకు స్థానిక ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఒంగోలు టౌన్ డీఎస్పీ నారాయణ స్వామిరెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఒంగోలు నగరానికి చెందిన మల్లవరపు కోటిరెడ్డి, చీమకుర్తి కుమార స్వామి, శ్రీపతి పేరయ్యలను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. వారి వద్ద నుంచి కొన్ని నకిలీ డాక్యుమెంట్లు, ఇతర పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. విచారణలో నకిలీ పత్రాల ద్వారా అమ్ముకున్న ప్రాపర్టీలకు సంబంధించి పంపకాలు చేసుకునేందుకుగాను వాటాల కోసం ఒప్పంద పత్రాలు కూడా రాసుకున్నట్లు వివరించారు. ఎస్పీ మలికాగర్గ్ నేతృత్వంలో ఏఎస్పీ(అడ్మిన్) కే.నాగేశ్వరరావు సారథ్యంలో ఏర్పాటైన సిట్ బృందం దర్యాప్తును వేగవంతం చేసిందన్నారు. తనతో పాటు దర్శి డీఎస్పీ అశోక్ వర్ధన్, తాలూకా సీఐ భక్తవత్సల రెడ్డిలతో పాటు పలువురు ఎస్సైలు ఈ కేసుల్లో లోతైన దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఒంగోలు నగరంతో పాటు పరిసర ప్రాంతాలు ముక్తినూతలపాడు, ముంగమూరు రోడ్డు, మామిడిపాలెం, రాజీవ్ నగర్, రావ్ అండ్ నాయుడు ఇంజినీరింగ్ కళాశాల ఏరియా, కర్నూలు రోడ్డు, కొప్పోలు రోడ్డు ప్రాంతాల్లో స్థలాలు, పొలాలు, ఇళ్లకు సంబంధించి నకిలీ డాక్యుమెంట్లు తయారు చేయటంలో కొందరు వ్యక్తులు సిద్ధహస్తులుగా తయారయ్యారన్నారు. ఇటీవల చీతిరాల పూర్ణచంద్రరావుతో పాటు మరో 19 మందిని నిందితులుగా నిర్ధారించారన్నారు. వివిధ రకాల వారికి చెందిన డెత్ సర్టిఫికెట్లు, వీలునామాలు, అగ్రిమెంట్లు, డీకే పట్టాల నకిలీ డాక్యుమెంట్లు తయారు చేసి రెండు మూడు చేతులు మారేలా రిజిస్ట్రార్ కార్యాలయంలో లావాదేవీలు నిర్వహిస్తారన్నారు. ఆ తరువాత లీగల్ ఒపీనియన్ తీసుకొని అమ్ముకోవటం చేస్తూ వస్తున్నారని చెప్పారు. గుంటూరు, చిలకలూరిపేటతో పాటు ఇతర ప్రాంతాలకు వెళ్లి అక్కడ దస్తావేజు స్టాంపులు రూ.20, రూ.50, రూ.100 తీసుకొని వస్తారన్నారు. నాన్ జ్యుడీషియల్ స్టాంపుల పేపర్లు కొనుగోలు చేసి వారి వద్ద పెట్టుకుంటారని, ఒంగోలులో డాక్యుమెంట్ రైటర్లు, లైసెన్సడ్ స్టాంపు వెండర్ల ద్వారా స్టాంపు పేపర్లను కొనుగోలు చేస్తుంటారని తెలిపారు. ముందుగానే పాత డేట్‌లకు సంబంధించిన స్టాంప్ పేపర్‌లను కొనుగోలు చేసి పెట్టుకుంటారన్నారు. వాటికి సంబంధించిన ముద్రలు, రౌండ్ సీల్స్ స్టాంప్ వెండర్ దగ్గర నుంచి తీసుకొని పెట్టుకుంటారని చెప్పారు. కొన్ని విష్ణు వర్ధన్ ద్వారా రౌండ్ సీల్ స్టాంప్స్, స్టాంపు వెండర్లకు చెందిన సీల్స్ తయారు చేసిపెట్టుకుంటారు. కొన్ని స్టాంపు పేపర్లు దగ్గర ఉంచుకుంటారని తెలిపారు. వాటి ఆధారంగా డూప్లికేట్ వీలునామాలు, పాత అగ్రిమెంట్లు తయారు చేస్తారన్నారు. యానాదిరావు గ్రామ సచివాలయ సర్టిఫికెట్లు, మున్సిపాలిటీలోని స్టోర్‌లో పనిచేసే స్పీడ్ అనే వ్యక్తి ద్వారా తెస్తుంటారని వెల్లడించారు. నగరానికి చెందిన పువ్వాడ శ్యాం ప్రసాద్ అనే వ్యక్తి ఖాళీ మీ సేవా సర్టిఫికెట్లు, పాత తెల్ల కాగితాలు, పాత బాండ్ పేపర్లతో పాటు, మున్సిపల్ కార్యాలయం నుంచి పుట్టిన తేదీ సర్టిఫికెట్లు, డెత్ సర్టిఫికెట్లు తెచ్చిస్తూ ఉంటాడని పేర్కొన్నారు. అదే విధంగా ఖాళీ ఈ–స్టాంప్ పేపర్లు ధారా వంశీ తెచ్చిస్తుంటాడన్నారు. వీరి వద్ద నుంచి అన్ని రకాల నకిలీ అగ్రిమెంట్లు, ఖాళీ స్టాంపు పేపర్లు, ఖాళీ మీ–సేవా సర్టిఫికెట్లు, విలేజ్ అండ్ వార్డు సెక్రటరీలకు చెందిన ఖాళీ సర్టిఫికెట్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. సిట్ ఆధ్వర్యంలో దర్యాప్తు వేగవంతంగా సాగుతోందన్నారు. విలేకరుల సమావేశంలో ఒంగోలు తాలూకా సీఐ భక్తవత్సల రెడ్డి, ఎస్సైలు తాలూకా ఎస్సైలు పున్నారావు, అంకమ్మ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి

- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు
- స్పందన నిర్వహించిన కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. సోమవారం స్పందన భవనంలో స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తొలుత డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం ద్వారా దూర ప్రాంత ప్రజల సమస్యలను ఫోన్ ద్వారా తెలుసుకుని సంబంధిత అధికారులను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన అర్జీల పరిష్కారంలో సహేతుకతతో పాటు రీ ఓపెన్ కాకుండా పరిష్కరించడం ముఖ్యమన్నారు. ఏదైనా కారణాలతో పరిష్కరించలేని సమస్యలను అర్జీదారులకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించడంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దీనిలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు లోకేశ్వరరావు, వరకుమార్, ఉమాదేవి, నారముని ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

➤ త్రిపురాంతకం మండలం రామసముద్రం గ్రామానికి చెందిన నాసరరెడ్డి తమ పొలం కొలిచేందుకు తగిన చలానా కట్టినా సర్వే చేయలేదని ఫిర్యాదు చేశారు. ఎన్నిసార్లు అడిగినా సర్వేకు రావడం లేదని, పరిశీలించి తన భూమిని సర్వే చేయించాలని కోరుతూ అర్జీ అందజేశారు.

➤ కొమరోలు మండలం రెడ్డిచెర్ల గ్రామానికి చెందిన పుల్లయ్య డయల్ యువర్ కలెక్టర్ కు ఫోన్ చేసి రైతు భరోసా పథకం కింద తన ఖాతాలో డబ్బులు జమకాలేదని తెలిపారు. పంచాయతీ సెక్రటరీకి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని, పరిశీలించి రైతు భరోసా డబ్బు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

➤ కనిగిరి మండలం పునుగోడు గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి తన భూమికి సంబంధించి ఆర్డీవో కోర్టులో కేసు నడుస్తుందని, సంబంధిత రిపోర్టు తహశీల్దారు వద్ద పెండింగ్‌లో ఉందని, దీంతో కేసు జాప్యం జరుగుతుందని తెలిపాడు. త్వరగా రిపోర్టు ఇప్పించి న్యాయం చేయాలని కోరాడు.

బ్రహ్మచారిణిగా హంస వాహనంపై..



బ్రహ్మచారిణి అలంకారంలో హంస వాహనంపై బాలా త్రిపురసుందరీదేవి

త్రిపురాంతకం: దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు శ్రీబాలాత్రిపురసుందరీదేవి ఆలయంలో వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మచారిణి అలంకారంలో హంసవాహన సేవను సోమవారం భక్తులు వైభవంగా నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఏర్పాట్లు దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. మంగళవారం రాత్రి చంద్రఘంట అలంకారంలో వ్యాఘ్రవాహన సేవ జరగనుంది.

పీడీ వివరాలను కచ్చితత్వంతో నమోదు చేయాలి

- జిల్లా పంచాయతీ అధికారి జి.వి.నారాయణరెడ్డి



టెలీకాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న డీపీవో నారాయణరెడ్డి

ఒంగోలు సిటీ: సుస్థిరాభివృద్ధి లక్ష్యాల ప్రకారం పంచాయతీ అభివృద్ధి సూచిక (పీడీఐ)ల వివరాలను కచ్చితత్వంతో నమోదు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి జి.వి.నారాయణరెడ్డి అన్నారు. డీపీవో కార్యాలయంలో సోమవారం డీపీవో నారాయణ రెడ్డి పంచాయతీరాజ్ కార్యక్రమాలపై టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధి సూచిక (పీడీఐ)లో భాగంగా ఎస్‌డీజీ లక్ష్యాలు, పేదరికం లేని, మెరుగైన జీవనోపాధి గ్రామం, ఆరోగ్యకరమైన గ్రామం, పిల్లల స్నేహపూర్వక గ్రామం, నీరు తగినంత గ్రామం, స్వచ్ఛమైన, ఆకుపచ్చ గ్రామం, స్వయం సమృద్ధిగా ఉన్న గ్రామం, సామాజిక, గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సమృద్ధి మౌలిక సదుపాయాలు, గుడ్ గవర్నెన్స్, ఉమెన్ ఫ్రెండ్లీ విలేజ్ వంటి అంశాల్లో భాగంగా వివిధ శాఖల డేటాను సేకరించి పంచాయతీ కార్యదర్శులు/ ఫెసిలిటేటర్ లను రిజిస్టర్ చేసి గ్రామ సచివాలయ సిబ్బందికి ప్రొఫార్మాలు అందించి వివరాలు సేకరించాలని సూచించారు. అనంతరం స్వామిత్వ సర్వేలో ఉన్న గ్రామాల్లో తప్పనిసరిగా మండల అధికారులు పర్యటించి, కచ్చితత్వంతో సర్వే జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్వామిత్వ సర్వే గురించి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాల షెడ్యూల్ తేదీ ప్రకారం నిర్వహించాలన్నారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో కనిగిరి, ఒంగోలు, మార్కాపురం డివిజనల్ పంచాయతీ అధికారులు, విస్తరణాధికారులు, రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.

ఉమ్మడి ప్రకాశంలో రూ.400 కోట్ల సేకరణే లక్ష్యం

- పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వై.ఎం.ప్రసాద్‌రెడ్డి

ఒంగోలు సిటీ: డిపాజిట్ల సేకరణ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి ప్రకాశం జిల్లాలో రూ.400 కోట్ల సేకరణే లక్ష్యమని ప్రకాశం జిల్లా సహకార కేంద్రబ్యాంకు చైర్మన్ వై.ఎం.ప్రసాద్‌రెడ్డి (బన్నీ) అన్నారు. స్థానిక పీడీసీసీ బ్యాంకు కార్యాలయంలో సోమవారం 'భారతి డిపాజిట్ స్కీమ్' కార్యక్రమాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ప్రభుత్వ కాలంలో సహకార వ్యవస్థ దివాలా తీసే పరిస్థితి ఏర్పడిందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో 2006 సంవత్సరంలో ఎం.ఎస్ వైద్యనాథ్ కమిటీ సిఫార్సుల మేరకు సహకార వ్యవస్థకు రూ.4 వేల కోట్లు కేటాయించి పునరుత్తేజం నింపారని కొనియాడారు. 2014–2019 సంవత్సరాల కాలంలో సహకార వ్యవస్థకు నిధులు కేటాయించకుండా నిర్వీర్యం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత సహకారశాఖకు రాష్ట్ర వ్యాప్తంగా రూ.295 కోట్ల నిధులు కేటాయించారన్నారు. అందులో ప్రకాశం జిల్లాకు షేర్ క్యాపిటల్ కింద రూ.30 కోట్లు కేటాయించారన్నారు. 'భారతి డిపాజిట్ స్కీమ్'లో 725 రోజులకు డిపాజిట్ చేసిన సాధారణ వ్యక్తులకు 7.50 శాతం వడ్డీ చొప్పున, సీనియర్ సిటిజన్స్ కు అత్యధిక వడ్డీ 8 శాతం పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశం అక్టోబర్ 16–2023 నుంచి నవంబరు 30–2023 వరకు మాత్రమే డిపాజిట్ల సేకరణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. మినిమం డిపాజిట్ రూ.5 వేల నుంచి ప్రారంభమవుతుందన్నారు. సేవింగ్ ఖాతాలపై 3.50 శాతం వడ్డీ ఇస్తున్నట్లు తెలిపారు. కంప్యూటరైజ్డ్ బ్యాంకు ఆర్టీజీఎస్/నెఫ్ట్, రూపే డెబిట్ కార్డ్స్,ఏటీఎం/మొబైల్ వ్యాన్ ఏటీఎం సౌకర్యం ఉందని తెలిపారు. కర్షక మిత్ర స్కీం కింద రైతులకు వ్యవసాయ భూమి తనఖా పై రూ.15 లక్షల వరకు త్వరితగతిన రుణాలు అందజేస్తున్నామన్నారు. జగనన్న తోడు, జగనన్న పాలవెల్లువ, పీఎం.స్వనిధి ద్వారా రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. రైతులందరికీ నిరంతరం సేవలందించడమే తమ లక్ష్యమన్నారు. 'భారతి డిపాజిట్ స్కీమ్' ను ప్రారంభించిన తర్వాత చెరుకూరి సుజాత రూ.10 లక్షలు, వై.సరోజిని రూ.5 లక్షలు డిపాజిట్ చేశారు. కార్యక్రమంలో ముఖ్య కార్యనిర్వహణాధికారి వై.ప్రకాష్, సీనియర్ అధికారులు, కేంద్ర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పీడీసీసీ బ్యాంకు కార్యాలయంలో 'భారతి డిపాజిట్ స్కీమ్' ను జెండా ఊపి ప్రారంభిస్తున్న పీడీసీసీ చైర్‌పర్సన్ వై.ఎం.ప్రసాద్‌రెడ్డి

వయసు 50...50 సార్లు రక్తదానం



50వ సారి రక్తదానం చేస్తున్న వీర రాఘవులు

ఒంగోలు టౌన్: అతడి పేరు పొట్టి వీర రాఘవరావు. వయసు 50 సంవత్సరాలు. ఇప్పటి వరకు 50 సార్లు రక్తదానం చేశారు. నగరానికి చెందిన రాఘవరావు రెడ్ క్రాస్ లో ఫ్యామిలీ క్లబ్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. రక్తదానం చేయమని తమ సంస్థ ద్వారా ప్రచారం చేస్తుంటారు. అలా ఎదుటి వారికి చెప్పడం వరకే పరిమితం కాకుండా ఆయన స్వయంగా ఇప్పటి వరకు 50 సార్లు రక్తదానం చేశారు. సోమవారం రాఘవరావు 50వ పుట్టిన రోజును పురస్కరించుకొని స్థానిక రెడ్‌క్రాస్ కార్యాలయంలో రక్తదానం చేశారు. ఆయన మాత్రమే కాకుండా ఆయన కుమారులు, స్నేహితులతో కూడా రక్తదానం చేయించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్, లయన్స్ క్లబ్ సభ్యులు పలువురు రాఘవకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శ్రీరాముల రెడ్డి, బ్లడ్ బ్యాంకు కన్వీనర్ మంగళగిరి నరసింహ రావు, రెడ్‌క్రాస్ పాలకమండలి సభ్యులు బెజవాడ పవన్, అదపాల వెంకటేశ్వర్లు, ఫ్యామిలీ క్లబ్‌సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్పందిస్తున్న హృదయాలు

సాక్షి ఎఫెక్ట్..

ఉలవపాడు: నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి వైద్య చికిత్స అందించేందుకు దాతలు ముందుకొస్తున్నారు. ‘పసిపాపకు పెద్ద కష్టం’ పేరుతో సోమవారం ‘సాక్షి’లో ప్రచురించిన కథనానికి పలువురు దాతలు స్పందించారు. కరేడు పల్లెపాలెం గ్రామానికి చెందిన ఏడాది వయసున్న బాలిక మాకా శ్రావ్య న్యూరోలాజికల్ డిజార్డర్‌తో విజయవాడలోని రెయిన్‌బో వైద్యశాలలో చికిత్స పొందుతోంది. చిన్నారి వైద్య ఖర్చుల నిమిత్తం ఉలవపాడులోని శ్రీసాయి ఒలింపియాడ్ స్కూల్ యాజమాన్యం కేశవరపు జాలిరెడ్డి, వెంకట శేషమ్మ రూ.30 వేలు అందించారు. అమెరికా నుంచి డాక్టర్ టి.నాగఉదయ్‌కిరణ్ పిల్లల వైద్య నిపుణుడు సతీష్‌బాబు ద్వారా రూ.30 వేలు అందజేశారు. అంతే కాకుండా ఫోన్‌పే ద్వారా సుమారు 150 మంది దాతలు నగదు పంపించారు. సుమారు రూ.1.80 వేల నగదు అందినట్లు చిన్నారి శ్రావ్య తండ్రి సురేష్ తెలిపారు. దాతలు, ప్రభుత్వం స్పందించి తన బిడ్డకు ప్రాణభిక్ష పెట్టాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

దోర్నాలలో కర్ణాటక వాసి మృతి



వైద్యశాలలో మృతి చెందిన జస్వంతరావు

పెద్దదోర్నాల: తీవ్ర అస్వస్థతకు గురై కర్ణాటకకు చెందిన భక్తుడు మృతి చెందిన సంఘటన సోమవారం పెద్దదోర్నాలలో చోటుచేసుకుంది. కర్ణాటకలోని యాదగిరి జిల్లా కొడైకల్‌కు చెందిన జస్వంతరావు(67), సతీమణి గీత మరికొందరు భక్తులతో కలిసి ఓ ప్రైవేట్ బస్సులో శ్రీశైలం వచ్చారు. స్వామి వారిని దర్శించుకుని స్వగ్రామానికి తిరుగుప్రయాణమయ్యారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం పెద్దదోర్నాల చేరుకోగానే జస్వంతరావు ఆరోగ్యం విషమించింది. దీంతో ఆయనను మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందారు.

నీటి కుంటలో పడి యువకుడు మృతి



అఫీజ్ మృతదేహాన్ని బయటకు తీస్తున్న పోలీసులు

మార్కాపురం రూరల్: నీటి కుంటలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మార్కాపురం మండలంలోని గోగులదిన్నె గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. మార్కాపురం రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మార్కాపురం పట్టణంలోని 10వ వార్డుకు చెందిన అబ్దుల్ అఫీజ్(32) మతి స్థిమితంలేక ఈనెల 13వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ మేరకు కుటుంబసభ్యులు పట్టణ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గోగులదిన్నె గ్రామ సమీపంలోని వెలిగొండ ప్రాజెక్టు సుంకేశుల గ్రామ భూ నిర్వాసితుల కాలనీ సమీపంలోని నీటి కుంటలో అఫీజ్ శవమై తేలాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై తెలిపారు.

డిసెంబర్ 3న సాగర తీర క్రీడా మహోత్సవం



క్రీడా మహోత్సవ బ్యానర్ ఆవిష్కరిస్తున్న రోటరీ సభ్యులు

చీరాల అర్బన్: రోటరీ డిస్ట్రిక్ట్ 3150 (తెలంగాణా రాష్ట్రం, గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలు) జిల్లా సాగర తీర క్రీడా మహోత్సవం డిసెంబర్ 3న రామాపురం బీచ్‌లోని పెరల్ రిసార్ట్స్ నందు జరుగుతాయని అధ్యక్షుడు మామిడాల శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం రోటరీ క్లబ్‌లో సాగర తీర క్రీడా మహోత్సవానికి సంబంధించిన బ్యానర్‌ను డిస్ట్రిక్ట్ గవర్నర్ బూసిరెడ్డి శంకరరెడ్డి ప్రారంభించారు. మొత్తం 115 రోటరీ క్లబ్‌ల నుంచి సుమారు 1800 మంది సభ్యులు హాజరవుతారన్నారు. సభ్యులు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్తీక మాసంలో ఉదయం నుంచి రాత్రి వరకు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సభ్యులకు ప్రశంస పత్రాలు, జ్ఞాపికలు అందించనున్నటు తెలిపారు. కార్యక్రమంలో పీవీ తులసీరామ్, పోలుదాసు రామకృష్ణ, డీవీ సురేష్, సింగారావు, జీవై ప్రసాద్, గుర్రం రాఘవరావు, వలివేటి మురళీకృష్ణ, డాక్టర్ ఐ.బాబూరావు, ఎంవీ రామారావు, ఎస్‌వీ స్వామి, హరినారాయణ, బాలవెంకటేశ్వరరావు, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

జగన్మాతా నమోస్తుతే..



కురిచేడులో అన్నపూర్ణదేవిగా శ్రీ జ్ఞానప్రసూనాంబ



మార్కాపురం అమ్మవారిశాలలో సావిత్రిదేవిగా దర్శనమిస్తున్న వాసవీ మాత



కనిగిరి వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో పూజలందుకుంటున్న అమ్మవారు



టంగుటూరు : గాయత్రీదేవి అలంకారంలో వల్లూరమ్మ తల్లి



మార్కాపురం చెన్నకేశవాలయంలో ఆదిలక్ష్మి రూపంలో రాజ్యలక్ష్మి అమ్మవారు



బేస్తవారిపేటలో భువనేశ్వరీదేవిగా వాసవీమాత



చీమకుర్తి సాక్షి రామలింగేశ్వరాలయంలో కామాక్షి రూపంలో దుర్గామాత

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఊరూవాడా వేడుకగా సాగుతున్నాయి. అమ్మవారి మూలవిరాట్‌లు, ఉత్సవ మూర్తులను వివిధ రూపాల్లో అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. మహిళా భక్తులు అభిషేకాలు, కుంకుమార్చనలో పాల్గొన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా దేవదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీల సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. - సాక్షి నెట్‌వర్క్



ఒంగోలు చెన్నకేశవస్వామి ఆలయంలో ధాన్యలక్ష్మీదేవిగా రాజ్యలక్ష్మి అమ్మవారు



పెద్దదోర్నాలలో రాజరాజేశ్వరీదేవి అలంకారంలో వాసవీ కన్యకా పరమేశ్వరి

ఈవీఎంల పరిశీలన షురూ..



ఈవీఎం గోడౌన్ వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు అర్బన్: స్థానిక భాగ్యనగర్‌లోని గోడౌన్‌లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు(ఈవీఎం) బ్యాలెట్ యూనిట్‌లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్‌ల ఫస్ట్ లెవెల్ చెకింగ్(ఎఫ్ఎల్‌సీ) భారీ బందోబస్తు మధ్య సోమవారం ప్రారంభమైంది. బెల్ కంపెనీ నుంచి వచ్చిన ఇంజినీర్లు ఈవీఎంలతోపాటు ఇతర పరికరాలను సూక్ష్మంగా పరిశీలిస్తున్నారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలన పూర్తయిన యంత్రాలకు గ్రీన్ స్టిక్కర్ వేసి సిద్ధం చేస్తున్నారు. ఈ ప్రక్రియను డీఆర్‌ఓ శ్రీలత పర్యవేక్షిస్తున్నారు. ఈవీఎం గోడౌన్ వద్ద భద్రతా ఏర్పాట్లను ఎస్పీ మలికాగర్గ్ పరిశీలించారు. నిరంతరం అప్రమత్తతో విధులు నిర్వహించాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఈవీఎం గోడౌన్ ప్రాంగణంలోకి ఇతరులు ప్రవేశించకుండా పక్కాగా తనిఖీ చేయాలని స్పష్టం చేశారు. అధికారులు, సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధుల ఐడీ కార్డులు తనిఖీ చేసిన తర్వాతే లోపలికి పంపాలన్నారు. మొబైల్స్, ఇతర ఎలక్ట్రానిక్ పరికారాలు అనుమతించవద్దన్నారు. ఎస్పీ వెంట ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి, డీఎస్పీ డీఎస్పీ మరియదాసు, తాలూకా సీఐ భక్తవత్సలరెడ్డి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ఉన్నారు.

కార్పొరేట్ ఆస్పత్రిపై విచారణ

ఒంగోలు టౌన్: చికిత్స కోసం వచ్చిన నిరుపేద రోగుల నుంచి 9 లక్షల రూపాయలను వసూలు చేశారనే ఫిర్యాదు నేపథ్యంలో ఒంగోలుకు చెందిన లక్ష్మీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అధికారులు సోమవారం విచారణ ప్రారంభించారు. భర్త దాడిలో తీవ్రంగా గాయపడిన యర్రగొండపాలేనికి చెందిన బెల్లంకొండ ఆదిలక్ష్మిని మెరుగైన చికిత్స కోసం ఆగస్టు చివరలో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. అయితే జీజీహెచ్‌లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్న ఆదిలక్ష్మి తండ్రి వెంకటేశ్వర్లు బంధువు దిబ్బయ్య.. ఎదురుగా ఉన్న లక్ష్మీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో చేర్పించారు. ఆ తర్వాత 40 రోజులకు పైగా ఆస్పత్రిలో ఉంచుకుని చికిత్స పేరుతో బాధితుల నుంచి ఆసుపత్రి యాజమాన్యం 9 లక్షల రూపాయల వరకు వసూలు చేసినట్లు బాధితులు కలెక్టర్ దినేష్‌కుమార్‌కు గత వారం ఫిర్యాదు చేయడం తెలిసిందే. దీనిపై స్పందించిన కలెక్టర్ బాధితులకు న్యాయం చేయాలని, కార్పొరేట్ ఆస్పత్రి మీద విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా క్షయ నివారణ అధికారి సురేష్, ఆరోగ్య శ్రీ మాజీ కోఆర్డినేటర్ శ్రావణ్‌తో డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజ్యలక్ష్మి విచారణ కమిటీ వేశారు. వారు సోమవారం విచారణ ప్రారంభించారు. విచారణలో భాగంగా లక్ష్మీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ రవీంద్రబాబు, ఆస్పత్రి నిర్వాహకుడు రాజును ప్రశ్నించినట్లు సమాచారం. అలాగే బాధితురాలు ఆదిలక్ష్మి తలిదండ్రులు వెంకటేశ్వర్లు, నాగమ్మతోపాటు వారి బంధువు దిబ్బయ్యను కూడా విచారించారు. విచారణ పూర్తయిన తర్వాత జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని డాక్టర్ సురేష్ తెలిపారు. కాగా నిరుపేద బాధిత కుటుంబానికి అండగా నిలవాల్సిన టీడీపీ నాయకులు యథావిధిగా డబ్బున్న బడాబాబులకు వత్తాసు పలికారు. లక్ష్మీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని కాపాడేందుకు యర్రగొండపాలేనికి చెందిన టీడీపీ ముఖ్య నాయకుడు తన అనుచరులను పంపించి రాజీకి ఒత్తిడి చేస్తున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది.

సైనిక లాంఛనాలతో ఆర్మీ ఉద్యోగి అంత్యక్రియలు



చిన్న ఈశ్వరరెడ్డికి గౌరవ వందనం సమర్పిస్తున్న ఏఆర్ పోలీసులు

బేస్తవారిపేట: విశాఖపట్నం డిఫెన్స్ సెక్యూరిటీ కోర్‌లో విధులు నిర్వర్తిస్తున్న మద్దుల చిన్న ఈశ్వర రెడ్డి శనివారం గుండెపోటుతో మృతి చెందారు. బేస్తవారిపేట మండలం కొత్తపేట గ్రామానికి చెందిన ఆయన ఇండియన్ ఆర్మీలో సుబేదార్‌గా ఉద్యోగ విరమణ పొందారు. గత 10 ఏళ్లుగా డిఫెన్స్ సెక్యూరిటీ కోర్‌లో ఉద్యోగం చేస్తున్నారు. శనివారం డ్యూటీలో ఉన్న సమయంలో తీవ్ర అస్వస్థతకు గురైన చిన్న ఈశ్వరరెడ్డిని సహచర సిబ్బంది హుటాహుటిన ఆర్మీ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని సోమవారం స్వగ్రామానికి తీసుకొచ్చారు. సుబేదార్ రాహుల్, ఒంగోలు ఎన్‌సీసీ యూనిట్ అధికారులు, ఏఆర్ పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో సైనిక లాంఛనాలతో అంతక్రియలు నిర్వహించారు. ఈశ్వరరెడ్డి భౌతికకాయంపై జాతీయ పతాకం ఉంచి గౌరవ వందనం సమర్పించారు. గన్ సెల్యూట్ చేసి గాల్లోకి కాల్పులు జరిపారు. మృతుడికి భార్య సుబ్బలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు



మృతి చెందిన వెంకటరెడ్డి

బేస్తవారిపేట: విద్యుదాఘాతానికి గురై రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని అక్కపల్లెలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన కొండా వెంకటరెడ్డి(52) తన పొలంతోపాటు మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. కౌలుకు తీసుకున్న పొలంలో మొక్కజొన్న పంట సాగు చేస్తున్నాడు. పొలానికి నీరు పెడుతున్న సమయంలో మధ్యలో విద్యుత్‌మోటార్ ఆగిపోయింది. ఫ్యూజ్ పోయిందని గ్రహించి తనిఖీ చేస్తున్న సమయంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. చుట్టు పక్కల పొలాల్లోని రైతులు గమనించి వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య నారాయణమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబానికి పెద్దదిక్కును కోల్పోవడంతో భార్యాపిల్లలు బోరున విలపిస్తున్నారు. వెంకటరెడ్డి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.నరసింహారావు తెలిపారు.

పేదలకు ఉచిత గ్యాస్ సిలిండర్, స్టవ్

● జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు



ఉజ్వల పథకంపై అధికారులతో చర్చిస్తున్న జేసీ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉజ్వల పథకం కింద పేదలకు ఉచితం గ్యాస్ కనెక్షన్, స్టవ్ అందజేసయనున్నట్లు జేసీ కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రకాశం భవనంలో సంబంధిత అధికారులతో ఉజ్వల పథకంపై సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. అర్హులైన పేదలందరికీ ఈ పథకం అందేలా చూడాలన్నారు. ఏరియా సేల్స్ అధికారులను పథకం అమలుకు సిద్ధం చేయాలన్నారు. ఈకేవైసీ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని సూచించారు. సిలిండర్లు డెలివరీ చేసే సమయంలో అధికంగా చార్జీలు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, తగిన చర్యలు తీసుకోవాలన్నారు. డీఎస్‌ఓ ఉదయభాస్కర్, సహాయ అధికారి పుల్లయ్య, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ మేనేజర్ భాస్కర్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ మేనేజర్ శశిధరన్, ఎల్పీజీ సెక్షన్ అసిస్టెంట్ డేనియల్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ జమానాలో విద్యుత్ రంగం మూడు ముక్కలు



ధర్నాలో ప్రసంగిస్తున్న ఈశ్వరయ్య

ఒంగోలు టౌన్: సంస్కరణల పేరుతో విద్యుత్ రంగాన్ని నాటి తెలుగుదేశం ప్రభుత్వం మూడు ముక్కలు చేసిందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య విమర్శించారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నాడు చంద్ర బాబు ప్రభుత్వం తీసుకున్న తప్పుడు నిర్ణయాల వల్లే నేడు విద్యుత్ రంగం తీవ్ర సంక్షోభంలో చిక్కుకుందన్నారు. సంస్కరణల పేరుతో విద్యుత్ ధరలను విపరీతంగా పెంచి నిరుపేద ప్రజలను తీవ్ర ఇబ్బందులపాలు చేయడంలో కమ్యూనిస్టులు ప్రాణ త్యాగాలు చేసి పోరాడారని గుర్తుచేశారు. బషీర్ బాగ్ ఉద్యమం దేశ చరిత్రలో నిలిచిపోయిందన్నారు. మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలు నిరుపేదలకు భారంగా పరిణమించాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు విద్యుత్ రంగాన్ని కార్పొరేట్ రంగం చేతికి అప్పగించేలా ఉన్నాయన్నారు. ధర్నాకు సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకురాలు ఎస్.లలిత కుమారి అధ్యక్షత వహించగా సీపీఎం జిల్లా నాయకులు జీవీ కొండారెడ్డి, న్యూ డెమోక్రసీ నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, పీవీఆర్ చౌదరి, కొత్తకోట వెంకటేశ్వర్లు, ఆర్.మోహన్, రాజశేఖర్, కంకణాల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ స్పందనకు 121 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు సబర్బన్: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 121 ఫిర్యాదులు వచ్చాయి. ఎస్పీ మలికా గర్గ్ ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. స్పందన ఫిర్యాదులను చట్ట పరిధిలో వేగంగా పరిష్కరించాలని ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ(అడ్మిన్)కే.నాగేశ్వరరావు, ఎస్బీ డీఎస్పీ బి.మరియదాసు, ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామి రెడ్డి, ట్రాఫిక్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఐసీసీఆర్ ఇన్‌స్పెక్టర్ దుర్గా ప్రసాద్, ప్యానల్ అడ్వకేట్ బీవీ శివరామకృష్ణ, స్పందన ఎస్సైలు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

ఒంగోలు అర్బన్: పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు 67వ అంతర్ జిల్లా అండర్-17 బాలబాలికల స్కూల్ గేమ్స్‌కు సంబంధించిన బ్రోచర్‌ను సోమవారం స్పందన భవనంలో కలెక్టర్ దినేష్‌కుమార్ ఆవిష్కరించారు. ఎస్‌జీఎఫ్ పోటీల్లో భాగంగా సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ నిర్వహణ బాధ్యతను జిల్లాకు కేటాయించినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు పీవీఆర్ బాలుర పాఠశాల క్రీడామైదానంలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాల బాలబాలికలు పోటీలకు హాజరుకానున్నారని చెప్పారు. పోటీలను ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ సుబ్బారావు, కె.వనజ, స్టెప్ సీఈఓ లోకేశ్వరరావు, డీఎస్‌ఓ ఉదయభాస్కర్, కోచ్ రాజరాజేశ్వరిదేవి తదితరులు పాల్గొన్నారు.

మండూకానికి పూజలు



కప్పకు నీరు పోస్తున్న స్థానికులు

కొనకనమిట్ల: ‘వరుణ దేవుడు కరుణించి వర్షాలు కురవాలి. పాడిపంటలతో ప్రజలంతా సుఖంగా ఉండాల’ని కాంక్షిస్తూ కొనకనమిట్ల మండలం గొట్లగట్టులో చిన్నారులు మండూకానికి(కప్ప) పూజలు చేశారు. రోకలికి మండూకాన్ని కట్టి ‘కప్ప కప్ప నీళ్లాడి కడవ నిండా వాన కురవాలి. ముగ్రో వానదేవుడా..’ అంటూ చిన్నారులు పాటపాడుతూ ఇంటింటికీ తిరిగారు. ప్రజలు కప్పకు నీరు పోసి వర్షం కురవాలని వేడుకున్నారు.